# ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని, భావి తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు మొక్కలు నాటాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నేరడిగొండ మండల కేంద్రంలోని కార్యాలయ ఆవరణలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు కార్యాలయ ప్రాంగణంలో పలు రకాల మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు తమ నిబద్ధతను చాటారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు అడవుల విస్తీర్ణం పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మొక్కలు నాటడమే కాకుండా అవి వృక్షాలుగా ఎదిగే వరకు సంరక్షించడం కూడా ప్రతిఒక్కరి బాధ్యత అని సూచించారు. పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు, ప్రకృతి సమతుల్యతను కాపాడేందుకు మొక్కల పెంపకం అత్యంత అవసరమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధి కి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- రాష్ట్ర మంత్రి సీతక్క
- బందాల గ్రామంలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన రహదారి, గ్రామపంచాయతీ భవనం ప్రారంభం





**ఉద్యమ కెరటం, ములుగు:** గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నారు. తాడ్వాయి మండలం బందాల గ్రామంలో రూ.30 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం ప్రారంభించారు. గ్రామంలో రూ.10లక్షల నిధులతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డు, రూ.20లక్షల నిధులతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా గ్రామపంచాయతీ భవనాలు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో, డీఎఫ్ఓ వికాస్ మీనా, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీ రాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత



**ఉద్యమ కెరటం, తాండూర్:** పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని మాదారం త్రీ ఇంక్లైన్ గ్రామ సర్పంచ్ చందనాల రవికుమార్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మాదారం త్రీ ఇంక్లైన్ గ్రామ పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే మొక్కల పెంపకం అత్యంత అవసరమని పేర్కొన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో చెట్లు కీలకపాత్ర పోషిస్తాయని, ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి క్రిష్ణయ్య, వార్డు సభ్యులు, ఏఎన్ఎం సిబ్బంది, అంగన్వాడీ ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం.. ప్రకృతిని కాపాడుకుందాం

- జిల్లా కలెక్టర్ హరిత, జిల్లా ఎస్.పి. నితికా పంత్



**ఉద్యమ కెరటం, పెంచికల్పేట్ :** ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, ప్రత్యామ్నాయ పర్యావరణహిత వస్తువులను ఉపయోగించడం ద్వారానే ప్రకృతిని కాపాడుకోగలమని జిల్లా కలెక్టర్ కె.హరిత పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పెంచికల్పేట్ ఫారెస్ట్ డివిజనల్ కార్యాలయంలో జిల్లా ఎస్.పి. నితికా పంత్, ఇతర అధికారులతో కలిసి ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణానికి విఘాతం కలిగితే భావితరాల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని హెచ్చరించారు. ఎలినో వల్ల ఉష్ణోగ్రతలు పెరగడం, నీటి లభ్యత తగ్గడం మానవాళికి ప్రమాదకరంగా మారింది. అందుకే చెట్లు నాటడమే కాకుండా నీటిని పొదుపుగా వాడుతూ ప్రతి వర్షపు నీటి బొట్టును భూమిలోకి ఇంకేలా చేయాలని కోరారు. ప్లాస్టిక్ కవర్లు, సంచులు, బాటిళ్ల వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఎస్.పి. నితికా పంత్ మాట్లాడుతూ మనం నేడు వాడుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు నేల, నీరు, జీవావరణాన్ని కలుషితం చేస్తూ భవిష్యత్తు తరాలను ఇబ్బందుల్లోకి నెడుతున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా చెట్లు నాటి సంరక్షించినప్పుడే ప్రకృతి సమతుల్యత సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. అలాగే, జిల్లా అటవీ అధికారి బాలామణి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటి సంరక్షించగలిగితేనే హరిత తెలంగాణ లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు.అనంతరం, ప్లాస్టిక్ రహిత నిత్యావసర వస్తువుల వినియోగంపై ఏర్పాటు చేసిన అవగాహన స్టాల్స్‌ను అధికారులు సందర్శించి ప్రజల్లో చైతన్యం నింపారు. ప్రజలు పర్యావరణహిత జీవన విధానాలను అలవర్చుకోవాలని కోరారు. ఇదే సందర్భంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్.పి. చిత్తరంజన్, అటవీ అధికారులు అప్పయ్య, అనిల్ కుమార్, స్థానిక సర్పంచ్ భక్తు రామచందర్ అటవీ సిబ్బంది పాల్గొన్నారు.




# అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** జిల్లాలో సరైన అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లాలోని కాగజ్ నగర్ మండలంలోని కొత్తసార్సాలా గ్రామం వద్ద సార్సాలా వాగు నుండి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను నిలిపి అనుమతి పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సరైన అనుమతులు లేకుండా వాగుల నుండి ఇసుకను తరలించడం, చెరువుల నుండి మట్టిని తరలించడం చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ఏప్రిల్ 1వ తేదీ నుండి మన ఇసుక వాహనం యాప్ ప్రారంభించిందని, ఇసుకను తరలించే వారు యాప్ లో స్లాట్ బుక్ చేసుకుని అనుమతి తీసుకోవాలని, సరైన అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ట్రాక్టర్ల డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.




# కాగజ్‌నగర్‌లో జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు ఘనంగా ప్రారంభం

**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్ :** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని బాల భారతి స్కూల్ ప్రాంగణంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి సబ్ జూనియర్ (అండర్-15) బాలబాలికల బాక్సింగ్ పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను కాగజ్‌నగర్ మాజీ మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ దస్తగిరి, ఎస్సై సందీప్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. యువ క్రీడాకారులు క్రమశిక్షణతో రాణించాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వేమూర్ల మధు మాట్లాడుతూ ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు ఈ నెల జూన్ 12, 13 తేదీలలో జరిగే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే అవకాశాన్ని పొందుతారని తెలిపారు. గ్రామీణ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దడంలో ఇలాంటి పోటీలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ముత్తు బాక్సింగ్ క్లబ్ చైర్మన్ శివకుమార్ నాయర్, కార్యదర్శి మదురై శేఖర్, వైస్ ప్రెసిడెంట్ కంబాల జయేందర్, ఎస్సై మోహన్ ప్రసాద్, ఉమ్మడి జిల్లా పరిధిలోని కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు, బాక్సర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయికి అర్హత సాధించడమే లక్ష్యంగా యువ బాక్సర్లు రింగ్‌లో ఉత్సాహంగా తలపడుతున్నారు.



# రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

- వానాకాలం సాగు మొదలైనా.. రైతు భరోసా ఎక్కడ..?
- ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్ సోషల్ మీడియా జిల్లా నాయకులు మజర్




**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** వానాకాలం సాగు సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతు భరోసా నిధులను ప్రభుత్వం ఇంకా విడుదల చేయకపోవడంపై బీఆర్ఎస్ సోషల్ మీడియా జిల్లా నాయకులు మజర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల పంట పెట్టుబడికి కీలకమైన ఈ నిధుల విడుదలలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మృగశిర కార్తెలోపు ప్రతి రైతు ఖాతాలో రైతు భరోసా నిధులు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఎకరాకు రూ.12వేల రైతు భరోసా అందిస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కనీసం గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన ఎకరాకు రూ.10వేల చొప్పునైనా వెంటనే విడుదల చేయాలని కోరారు. ఇప్పటికే ఎగ్గొట్టిన మూడు విడతల నిధుల పరిస్థితిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, సకాలంలో ఆర్థిక సాయం అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతు భరోసా నిధుల విడుదలలో జరుగుతున్న జాప్యానికి గల కారణాలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయమే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని చెప్పే ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా రైతుల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు తక్షణమే పెట్టుబడి సాయం అందించి వానాకాలం సాగుకు భరోసా కల్పించాలని కోరారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

- బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కుంభ సందీప్

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కుంభ సందీప్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయ సేవాధికార సంస్థ బోథ్ ఆధ్వర్యంలో శుక్రవారం బోథ్ మండలంలోని పొచ్చర జలపాతం వద్ద పర్యావరణ పరిరక్షణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జలపాతం ప్రాంగణంలో మొక్కను నాటిన పర్యావరణ హరిత శోభను చాటారు. అనంతరం మాట్లాడుతూ నేటి సమాజంలో పర్యావరణ పరిరక్షణ అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ తమ పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవం, ఇతర ముఖ్యమైన వేడుకల సందర్భంగా తప్పనిసరిగా మొక్కలు నాటాలని సూచించారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా అవి పెద్దయ్యే వరకు సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని పిలుపునిచ్చారు. భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందించేందుకు ప్రతి పౌరుడు తనవంతు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ పంద్రం శంకర్, అడ్వకేట్లు కుమ్మరి విజ య్ కుమార్, జమీర్ అహ్మద్ ఖాన్, ఎస్.మహేష్, ఎఫ్‌బీఓ వసంత్, అటవీ శాఖ సిబ్బంది, స్థానిక మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** జిల్లాలో ఈ నెల 12 నుండి 19వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తో కలిసి బడిబాట కార్యక్రమం నిర్వహణపై అన్ని ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, పాఠశాలలను విద్యార్థుల నమోదు 100 శాతం ఉండాలని, ఆ దిశగా విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని తెలిపారు. అంగన్వాడి లలో ఉన్న విద్యార్థి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉండాలని, ప్రాథమిక పాఠశాలలో ఉన్న విద్యార్థి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉండాలని, ఇందులో ఉన్న విద్యార్థి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు వెళ్లాలని, 10వ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరేలా పర్యవేక్షించాలని తెలిపారు. ఏ విద్యార్థి బడి బయట ఉండకూడదని, ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు పాఠశాల ప్రారంభమైన రోజునే పాఠ్యపుస్తకాలు, వర్క్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు, అల్పాహారం, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందని, విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. బడిబాట కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వామ్యులను చేయాలని, ఈ నెల 12 నుండి 19వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాలలో రోజుకు ఒక కార్యక్రమాన్ని నిర్వహించేలా కార్యచరణ అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సచ్చిదానంద చారి, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నదీమ్, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, అన్ని ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల అధికారులు పాల్గొన్నారు.

# ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



PROCEEDINGS OF THE DIRECTOR, SCHOOL EDUCATION AND STATE PROJECT DIRECTOR, SAMAGRA SHIKSHA, TELANGANA, HYDERABAD
Present: Dr. E. Naveen Nicolas, I.A.S.

Rc.No:830284(21021)/TSS/Pdg/T6/2025 Dated: 26.05.2026

Sd/- Dr. E. Naveen Nicolas, I.A.S.
Director of School Education &
State Project Director,
Samagra Shiksha, Telangana

**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ మండలంలోని 22 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 2026–27 విద్యా సంవత్సరం నుంచి ప్రీ–ప్రైమరీ తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో గౌరవ వేతనం ప్రాతిపదికన ఆయా, ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు సంబంధిత పాఠశాలల్లో నిర్ణీత దరఖాస్తు ఫారంతో పాటు అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. ఎంపిక ప్రక్రియలో ముందుగా సంబంధిత వార్డు, గ్రామానికి చెందిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, అనంతరం మండలంలోని ఇతర గ్రామాల అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత, ఆయా పోస్టుకు కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత విద్యార్హతగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. విద్యార్హత, నివాస ధ్రువీకరణ పత్రాలు, తదితర జిరాక్స్ ప్రతులను గెజిటెడ్ అధికారితో అటెస్టు చేయించి దరఖాస్తుకు జతపర్చాలని సూచించారు. ఈ నియామక ప్రక్రియ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రీ–ప్రైమరీ తరగతులు మంజూరైన పాఠశాలల్లో హరిజనవాడ, బాబునగర్, గంగారాంబస్తీ, నవగాంబస్తీ, రిక్షా కాలనీ, బోరిగాం, కడంబా, ఈస్గాం, నామానగర్, జీడిచెను, భట్పల్లి, బలగాల, జవ్వాజిగూడ, నజురుల్ నగర్, కోసిని, సర్ సిల్క్, డాడానగర్, కొత్త అనుకోడ, బోడేపల్లి తదితర పాఠశాలలు ఉన్నట్లు వివరించారు. అర్హత కలిగిన స్థానిక అభ్యర్థులు ఈనెల 9వ తేదీలోగా సంబంధిత పాఠశాలల్లో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

# భారీ సైబర్ మోసం కేసులో మరో నిందితుడు అరెస్ట్

- **స్టాక్ మార్కెట్, క్రిప్టో ట్రేడింగ్ పేరుతో కోట్ల రూపాయల మోసం**




**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి పోలీస్ స్టేషన్లో నమోదైన భారీ సైబర్ మోసం కేసులో మరో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఖమ్మంకు చెందిన నల్ల నాగుల శ్వేతన్ను గురువారం ఏసీపీ వసుంధర యాదవ్ పర్యవేక్షణలో సత్తుపల్లి ఇన్స్పెక్టర్ శ్రీహరి అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్వేతన్ 2023లో చంద్రుగొండలోని కేథలిక్ సిరియన్ బ్యాంక్ (సీఎస్బీ)లో "శ్వేతన్ ఎంటర్ప్రైజెస్" పేరిట కరెంట్ అకౌంట్ ప్రారంభించినట్లు విచారణలో వెల్లడైంది. ఇప్పటికే ఈ కేసులో 2026 ఫిబ్రవరి 23న అరెస్ట్ అయిన అడపా రామవెంకట చరణ్ ఇచ్చిన సమాచారం మేరకు అతని స్నేహితులు ఉడతనేని వికాస్ చౌదరి, బొప్పన నాగప్రియలు హైదరాబాద్లో ఓ సంస్థ ఏర్పాటు చేసి విదేశాల్లోని కొందరు వ్యక్తులతో సంబంధాలు కొనసాగిస్తూ కాల్ సెంటర్లను నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఈ ముఠా స్టాక్ మార్కెట్ ట్రేడింగ్, క్రిప్టో ట్రేడింగ్, గేమింగ్, బెట్టింగ్, ఓటీపీ ఫ్రాడ్స్, రూపే ట్రాన్సాక్షన్లు, మ్యాట్రిమోనీ సేవల పేరుతో ప్రజలను ఆకర్షించి అధిక లాభాల ఆశ చూపినట్లు దర్యాప్తులో తేలింది. బాధితులను టెలిగ్రామ్ గ్రూపుల్లో చేర్చి, వివిధ లింకులు, క్యూఆర్ కోడ్లు పంపి వారి బ్యాంకు ఖాతాల నుంచి మోసపూరితంగా నగదు కాజేసినట్లు పోలీసులు వెల్లడించారు. అక్రమ లావాదేవీల కోసం పలువురి పేర్లతో మ్యూల్ బ్యాంక్ ఖాతాలను సేకరించి వాటి ద్వారా నగదు బదిలీలు నిర్వహించినట్లు గుర్తించారు. ఈ కేసులో మొత్తం 28 మంది నిందితులు ఉండగా, ఇప్పటివరకు 27 మందిని అరెస్ట్ చేసి రిమాండ్కు పంపినట్లు పోలీసులు తెలిపారు. మిగిలిన నిందితుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, కేసు దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు.


# వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగుడు

- **వరుస దొంగతనాల నేపథ్యంలో అవగాహన కల్పించిన ఎస్సై కవిత**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** వేంసూర్ మండలంలో వరుస దొంగతనాలు, చోరీయత్నాలు ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తున్నాయి. తాజాగా మండల పరిధిలోని కందుకూరు గ్రామంలో గురువారం అర్ధరాత్రి ఓ దుండగుడు ఇంట్లోకి చొరబడి నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు నాంతాడును లాక్కొని పరారయ్యాడు. వృద్ధురాలు ఒక్కసారిగా మేల్కొని గట్టిగా కేకలు వేయడంతో దుండగుడు అక్కడి నుంచి పారిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో ఆందోళన నెలకొంది. ఇటీవల మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న దొంగతనాల నేపథ్యంలో వేంసూర్ ఎస్సై కవిత గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్లలోని నగదు, బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపర్చాలని, సాధ్యమైనంత వరకు బ్యాంకు లాకర్లలో ఉంచాలని సూచించారు. మహిళలు బంగారు ఆభరణాలు ధరించి బయటకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రాత్రి వేళల్లో అనుమానాస్పద కదలికలు, దొంగతనాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. అలాగే గ్రామాల్లో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతోనే నేరాలను సమర్థంగా అరికట్టవచ్చని, ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండి తమ ఆస్తులను కాపాడుకోవాలని సూచించారు.

# బదిలీపై వెళ్తున్న ఏఈఓలకు ఘన సన్మానం



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ విస్తరణ అధికారులుగా (ఏఈఓలు) విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న యు.శంకర్, వివి.ధనలక్ష్మిలకు శుక్రవారం కొత్తపల్లి రైతు వేదికలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రైతులు, ఆదర్శ రైతులు, విత్తన దుకాణాల యజమానులు శాలువాలు కప్పి వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు సహజ ప్రక్రియేనని, ప్రజలతో మమేకమై సేవలందించిన అధికారులు ఎక్కడ పనిచేసినా ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. బదిలీల్లో భాగంగా యు.శంకర్ వాంకిడి మండలానికి, వివి.ధనలక్ష్మి నెన్నెల మండలానికి బదిలీ అయ్యారు. వారి స్థానంలో రెబ్బెన మండలం నుంచి రాకేష్, భీమారం మండలం నుంచి మౌనిక తాండూర్ మండలానికి ఏఈఓలుగా బదిలీపై వచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులను కూడా నాయకులు, రైతులు శాలువాలతో సన్మానించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.సుష్మ, ఏఈఓ వెంకటేష్, తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్దబోయిన శంకర్, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, కొత్తపల్లి సర్పంచ్ ఆకుల వెంకటేష్, ద్వారకాపూర్ సర్పంచ్ మసాడి తిరుపతి, గోపాల్నగర్ సర్పంచ్ గాట్ల నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.ఉమారాణి, ఎం.శ్రీనివాస్, సుందిళ్ల భూమయ్య, ఎం.గోవర్ధన్, బీఆర్ఎస్ నాయకులు దత్తు దొర, ఎం.శ్రీరాములు, మొగిలి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలి


## అటవీ శాఖ ఫోటో ఎగ్జిబిషన్ను సందర్శించిన మంత్రి సీతక్క





**ఉద్యమ కెరటం, ములుగు:** పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ములుగు జిల్లా ఇంచర్ల ఏకో పార్క్లో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అటవీ సంరక్షణాధికారి కాళేశ్వరం జోన్ బి. ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క, సీసీఎఫ్ బి.ప్రభాకర్, జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకన్, ఇంచర్ల సర్పంచ్ కుమార్ గౌడ్ తదితరులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమవంతు బాధ్యతను చాటారు. అనంతరం అటవీ శాఖ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ను సందర్శించిన అతిథులు అటవీ సంపద సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ, వన్యప్రాణుల రక్షణకు సంబంధించిన చిత్రాలను పరిశీలించారు. ప్రకృతి పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, ప్రతిఒక్కరూ పర్యావరణ హిత చర్యలను అలవర్చుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, ఇంచర్ల ఉపసర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అటవీ శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జియో టవర్ ఉన్నా.. నెట్వర్క్ సమస్యలు

## జంగం గ్రామ ప్రజల ఆవేదన





**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** జైనూర్ మండలం జంగం గ్రామపంచాయతీ పరిధిలో జియో మొబైల్ టవర్ ఏర్పాటు చేసినప్పటికీ గ్రామ ప్రజలకు సరైన నెట్వర్క్ సేవలు అందడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో టవర్ ఉన్నప్పటికీ కాల్స్ సరిగా కనెక్ట్ కాకపోవడం, ఇంటర్నెట్ వేగం చాలా తక్కువగా ఉండటం, తరచూ నెట్వర్క్ సిగ్నల్ అందకపోవడం వంటి సమస్యలు తీవ్రంగా వేధిస్తున్నాయని తెలిపారు. నెట్వర్క్ సమస్యల కారణంగా విద్యార్థులు ఆన్లైన్ విద్యను అభ్యసించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, యువత ఉద్యోగాలకు సంబంధించిన దరఖాస్తులు, ఇతర ఆన్లైన్ పనులను పూర్తి చేయలేకపోతున్నారు. రైతులు, వ్యాపారులు కూడా డిజిటల్ సేవలను వినియోగించడంలో ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ కాల్స్ కూడా సరిగా వెళ్లకపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు, జియో సంస్థ ప్రతినిధులకు ఫిర్యాదు చేసినప్పటికీ శాశ్వత పరిష్కారం లభించలేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో మెరుగైన నెట్వర్క్, వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు అందేలా టవర్ సామర్థ్యాన్ని పెంచాలని కోరుతున్నారు. గ్రామంలో టవర్ ఉన్నప్పటికీ నెట్వర్క్ అందకపోవడం విచారకరమని, అధికారులు, జియో సంస్థ ప్రతినిధులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# చెత్త వర్గీకరణతో పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణం సాధ్యం



**ఉద్యమ కెరటం, హన్మకొండ:** చెత్త వర్గీకరణతో పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణం సాధ్యమవుతుందని గ్రామ సర్పంచ్ గరిగె కల్పనా కృష్ణమూర్తి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. తడి, పొడి చెత్త, హానికర చెత్త, ప్రత్యేక రకం చెత్తల వర్గీకరణ, చెత్త నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతపై గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో చెత్త నిర్వహణ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఇంటి వద్దనే తడి, పొడి చెత్తలుగా విడదీసి సేకరించడం ద్వారా పరిశుభ్రమైన గ్రామ వాతావరణాన్ని నెలకొల్పవచ్చని తెలిపారు. ప్రతి కుటుంబం చెత్తను వర్గీకరించి గ్రామపంచాయతీకి అందజేయడం ద్వారా గ్రామ పరిశుభ్రతకు తోడ్పడాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడవచ్చని పేర్కొన్నారు. చెత్త వర్గీకరణపై ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వేల్పుల ప్రసాద్, దామెర అఖిల, మిరాల రజిత, రవి, బత్తుల వాణి వేణు, బోడ శ్రీవాణి శ్రీను, వీవో అరుణ, శ్యామల, చిర్ర కవిత తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్గా ఇజ్జ గిరి సంజయ్



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్గా కౌన్సిలర్ ఇజ్జగిరి సంజయ్ను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నియమించింది. మున్సిపల్ కాంగ్రెస్ కౌన్సిలర్లందరి ఏకగ్రీవ ఆమోదంతో ఈ నియామకం జరిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా నూతన ఫ్లోర్ లీడర్ ఇజ్జగిరి సంజయ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అధిష్టా నానికి, కాంగ్రెస్ కౌన్సిలర్లందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ పదవి దక్కేలా సహకరించిన జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, పార్టీ ఇంచార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, గండ్రత్ సుజాత, సాజిత్ ఖాన్, సంజీవ్ రెడ్డి, బోరంచు శ్రీకాంత్ రెడ్డితో పాటు పార్టీ పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఫ్లోర్ లీడర్ ఇజ్జ గిరి సంజయ్ను మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్, పలువురు కౌన్సిలర్లు శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ మరింత బలోపేతం కావడంతో పాటు మున్సిపాలిటీ అభివృద్ధిలో ఆయన కీలకపాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు , కార్యకర్తలు తదితరులు పాల్గొ న్నారు.

## నేరడిగొండలో భారీ చోరీ

- తాళం వేసిన ఇంట్లో రూ.70 వేల నగదు, నాలుగు తులాల బంగారం అపహరణ



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఇంటిని లక్ష్యంగా చేసుకున్న గుర్తుతెలియని దుండగులు భారీ చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో దాదాపు నాలుగు తులాల బంగారు ఆభరణాలు, రూ.70 వేల నగదును అపహరించినట్లు బాధితులు తెలిపారు. స్థానిక ఆటో డ్రైవర్ జహీర్ తన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం బోథ్లోని అత్తగారి ఇంటికి కార్యక్రమానికి వెళ్లా రు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమనించిన దుండగులు తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. అనంతరం బీరువాలో భద్రపర్చిన నగదు, బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. చోరీ అనంతరం నిందితుడు తన చెప్పులను సంఘటనా స్థలంలోనే వదిలి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. ఇంటికి తిరిగి వచ్చిన జహీర్ కుటుంబ సభ్యులు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్సై ఇమ్రాన్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సహాయంతో ఆధారాలను సేకరించి దర్యాప్తు చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## సీతాగొందిలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

- మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపునిచ్చిన కాంగ్రెస్ నాయకులు




**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** మండలంలోని సీతాగొంది గ్రామంలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి అనసూయ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామ కాంగ్రెస్ కమిటీ సభ్యులు, గ్రామస్థులతో కలిసి గ్రామంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. అనంతరం నాటిన మొక్కలను సంరక్షించాలని గ్రామ ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టి, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు గ్రామాల్లో విస్తృతంగా హరిత కార్యక్రమాలు చేపట్టాలని, యువత ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు. పచ్చదనమే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ సంతోష్ గౌడ్, కాంగ్రెస్ గ్రామ కమిటీ సభ్యులు, యువకులు, కార్యకర్తలు పాల్గొ న్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రత్యేక ప్రజా దర్బార్

- మహిళల ఆర్థిక పురోగతికి కొత్త అవకాశాలు కల్పిస్తాం
- రాష్ట్ర మంత్రి సీతక్క



**ఉద్యమ కెరటం, ములుగు:** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని త్వరిత గతిన పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమాలను నిర్వహిస్తు న్నామని, ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచే స్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మహిళల ఆర్థిక సాధికారతకు కొత్త అవకాశాలు సృష్టించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. 99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం ములుగు జిల్లా తాడ్వాయి మండలం పోచాపూర్ గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో, అలాగే లింగాల గ్రామపం చాయతీ ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమాల్లో జిల్లా కలెక్ట ర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. బిట్టుపల్లి, బంధాల, పోచాపూర్, నర్సాపూర్ పి.ఎల్, బొల్లెపల్లి , ఒడ్డుగూడెం, లింగాల, బోటి లింగాల, లవ్వల, కోడిశాల గ్రామాల ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో రహదారులు, వంతెనలు, చెక్డ్యాములు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. పోచాపూర్– న ర్సాపూర్– అ ల్లి గూడెం రహదారి అభివృద్ధితో పాటు పలు అంతర్గత రహదారి పనులు చేపట్టినట్లు చెప్పారు. అటవీ అనుమతుల కారణంగా నిలిచిపోయిన పనులకు అవసరమైన అనుమతులు సాధించి అభివృద్ధి పనులను వేగవంతం చేసినట్లు వివరించారు. రైతులకు రెండు పంటలకు సాగునీరు అందించేందుకు వాగులు, చెరువుల అభివృద్ధికి రూ.70 నుంచి రూ.80 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. లింగాల ప్రాంతంలో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం కొత్త సబ్స్టేషన్ మంజూరు చేసి త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ప్రజా దర్బార్లో అందిన ప్రతి దరఖాస్తును పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరి స్తామని హామీ ఇచ్చారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందన్నారు. మహిళా సంఘాల ద్వారా చేపలు, పచ్చళ్లు తదితర ఉత్పత్తుల తయారీ, విక్రయాలకు శిక్షణతో పాటు ఆర్థిక సహాయం అందిస్తున్నామని అన్నారు. గిరిజన మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ములుగు నియోజకవర్గంలో ఇప్పటికే 5వేలకు పైగా ఇళ్లు మంజూరయ్యాయని, రెండో విడతలో మరో 2వేల ఇళ్ల ను ప్రభుత్వం మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరూ ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, డీఎఫ్ఓ వికాస్ మీనా, అదనపు కలెక్ట ర్లుసి. హెచ్. మహేందర్ జి.సంపత్ రావు, ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్ట ర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, ప్రజాప్రతి నిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొ న్నారు.

# అడవుల సంరక్షణతోనే గ్లో బల్ వార్మింగ్ సవాళ్ల ను ఎదుర్కోగలం

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మారుతున్న వాతావరణ పరిస్థితులు, గ్లోబల్ వార్మింగ్ సవాళ్లను ఎదుర్కోవడానికి అడవులను రక్షించుకోవడం ఒక్కటే మార్గమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. "ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక"లో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్గూడ బీట్లో అడవుల పునరుజ్జీవనం కోసం హైడెన్సిటీ మిక్స్డ్ ప్లాంటేషన్ విధానంలో భారీగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్తో కలిసి కలెక్ట ర్ మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, అడవుల విస్తీర్ణం పెంపుదల లక్ష్యంగా ప్రభుత్వం అటవీ శాఖ ద్వారా విస్తృత అవగాహన కల్పిస్తూ సంరక్షణ చర్యలు చేపడుతోందన్నారు. "పచ్చదనం– ప్రగతికి ప్రణాళిక" నినాదంతో ప్రతిఒక్కరూ మొక్కలు నాటడాన్ని ఉద్యమంగా మార్చాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, వాటిని వృక్షాలుగా ఎదిగే వరకు సంరక్షించడం అంతకంటే ముఖ్యమని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను బ్రతి కించేందుకు అధికారులు, ప్రజలు సమిష్టిగా బాధ్యత తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లా డుతూ పర్యావరణ పరిరక్షణను ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు. ప్లా స్టి క్ వినియోగాన్ని తగ్గించి ప్రకృతి సంరక్షణలో తమవంతు పాత్ర పోషించాలని సూచించారు. ప్రకృతి సమతుల్యత దెబ్బతింటే మానవాళి మనుగడకే ప్రమాదమని, భావిత రాలకు స్వచ్ఛమైన గాలి, పచ్చని వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా మొక్కల పెంపకం, అడవుల రక్షణకు పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ బోరంచు చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సర్పంచ్ నిరోష, డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, ఎఫ్డీఓ అరవింద్, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, విద్యార్థులు, అటవీ, పోలీస్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొ న్నారు.

# ఘనంగా రిమ్స్ డైరెక్టర్ జన్మదిన వేడుకలు





**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** వైద్యరంగంలో విశిష్ట సేవలు అందిస్తూ పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలను చేరవేస్తున్న రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుడిహత్నూర్ సర్పంచ్ ఆడేశీల డైరెక్ట ర్ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ రిమ్స్లో డాక్ట ర్ జైసింగ్ బాధ్యతలు చేపట్టి న నాటి నుంచి వైద్యసేవలు మరింత మెరుగుప డ్డాయని అన్నారు. సాధారణ ప్రజలకు అందుబాటులో ఉంటూ రోగుల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించే అధికారి అని కొనియాడారు. పేద ప్రజలకు అండగా నిలుస్తూ మానవతా దృక్పథంతో సేవలందిస్తున్నారని ప్రశంసించారు. కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు ససానే మాధవ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ముండే గణేష్, ఎంఐఎం మండల అధ్యక్షుడు హర్షద్ ఖురేషి మాట్లాడుతూ డాక్ట ర్ జైసింగ్ నాయకత్వంలో రిమ్స్ ఆసుపత్రి అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు కూడా వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. మన్నాపూర్ ఉప సర్పంచ్ నార్వాటె సునీల్, లింగాపూర్ ఉప సర్పంచ్ మోతేవార్ గణపతి, గర్కంపేట ఉపసర్పంచ్ భీంరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా డాక్ట ర్జైసింగ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సైతం వెంటనే స్పందిస్తూ వైద్య సిబ్బందిని సమన్వయం చేయడంలో ఆయన పనితీరు ఆదర్శనీయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు కాగ్ని రామ్కిషన్, కాథలే రాందాస్, సయ్యద్ జాఫర్, లక్ష్మణ్ భాలే రావు కూడా డాక్ట ర్ జైసింగ్ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేశారు. యువ నాయకులు ఆడే జైపాల్, ఆడే క్రాంతి కుమార్ మాట్లాడుతూ డాక్ట ర్ జైసింగ్ సేవా నిరతి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. డాక్ట ర్ జైసింగ్ జన్మదిన వేడుకల్లో స్థానిక ప్రజలు, రిమ్స్ ఆసుపత్రి సిబ్బంది, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొ ని శుభాకాంక్షలు తెలియజేసి ఆయన సేవలను ప్రశంసించారు.

# ఆయిల్ ఫామ్ రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుంది

- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** సత్తుపల్లి నియో జకవర్గంలోని వేంసూరు మండల పరిధి కల్లూరుగూడెం గ్రామంలో నిర్మాణంలో ఉన్న పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ పనులను శుక్రవారం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని తెలుసుకుని అధికారులకు, సంబంధిత నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పామ్ ఆయిల్ ఫ్యాక్టరీని కల్లూ రు గూడెంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఫ్యాక్ట రీ అందుబాటులోకి రావడం ద్వారా వేంసూరు మండలంతో పాటు పరిసర ప్రాంతాల ఆయిల్ ఫామ్ రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు పంటను దూర ప్రాంతాల్లో ని ఫ్యాక్టరీలకు తరలించాల్సి రావడంతో రైతులు అధిక రవాణా వ్యయాన్ని భరించాల్సి వచ్చేదని, స్థానికంగా ఫ్యాక్టరీ ఏర్పాటు కావడం ద్వారా ఆ భారం గణనీయంగా తగ్గుతుందని అన్నారు. రైతులు తమ ఉత్పత్తులను త్వరితగతిన ఫ్యాక్టరీకి చేరవేయగలిగే అవకాశం ఉండటంతో పాటు పంట నాణ్యత కూడా కాపా డబడుతుందని తెలిపారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీ గోడౌన్ను సందర్శించి అక్కడ నిల్వ ఉంచిన వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన పంటల నిల్వ, నిర్వహణ, భద్రతా చర్యలపై అధికారులతో చర్చించి అవసరమైన సూచనలు చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మార్కెట్ యార్డుల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికా రులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, వేంసూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్ రెడ్డి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పుచ్చకాయల సోమిరెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆయిల్ ఫామ్ మేనేజర్, ఆయిల్ ఫామ్ రైతులు తదితరులు పాల్గొ న్నారు.

# అడవులు, జల వనరుల సంరక్షణతోనే భవిష్యత్ తరాలకు భద్రత

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** పర్యావరణ పరిరక్షణ కేవలం అటవీ శాఖ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ప్రభుత్వ శాఖతో పాటు ప్రతి పౌరుడు కూడా బాధ్యతగా భాగస్వామ్యం కావాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. జిల్లాలో అడవులు, జల వనరుల సంరక్షణే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణతో జిల్లా యంత్రాంగం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. "ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక"లో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన వేడుకలకు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్లతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల గీతాలాపన, స్థానిక కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహ్వానితులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ప్రతి ఇంటికి పంపిణీ చేసిన ఆరు మొక్కలను కుటుంబ సభ్యుల మాదిరిగా సంరక్షించాలని ప్రజలకు సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో నాటిన మొక్కలు పెరిగేలా సర్పంచులు, కౌన్సిలర్లు, స్థానిక అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి దుకాణదారుడు తమ దుకాణం ముందు మొక్కలు నాటాలని, పిల్లల్లో చిన్నతనం నుంచే పర్యావరణ స్పృహ పెంపొందించే బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. అడవుల సంరక్షణతో పాటు గిరిజనులు, స్థానిక ప్రజల జీవనోపాధి మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెరువులు, జల వనరులు కబ్జాల బారిన పడకుండా ప్రజలు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యవసాయ భూముల్లో పంట కోత అనంతరం మిగిలే వ్యర్థాలను కాల్చడంతో గాలి కాలుష్యానికి తోడు భూసారం దెబ్బతింటుందని అన్నారు. భూమిలోని మిత్ర పురుగులు నశించి పంట దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. పంట వ్యర్థాలను దహనం చేసే రైతులపై జరిమానాలు విధిస్తామని, వాటిని భూమిలో కలియదున్నడం, పశువుల మేతగా వినియోగించుకోవాలని సూచించారు. భూగర్భ జలాల పరిరక్షణ కోసం ప్రతి ఇంటి వద్ద, బోర్ల సమీపంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం రూపొందించిన ప్రత్యేక పోస్ట ర్లను ఈ సందర్భంగా కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లాలోని జీవవైవిధ్య ప్రాంతాల ప్రాముఖ్యతను విద్యార్థులు, ప్రజలకు తెలియజేసేందుకు "వన దర్శనం" వంటి



అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణహిత జీవనశైలిని అలవర్చుకోవాలని ప్రజలకు సూచించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని కోరారు. జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పర్యావరణ కాలుష్యానికి దారితీస్తున్న కారణాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు, పర్యావరణ పరిరక్షణలో విశేష సేవలందించిన సర్పంచులు, అధికారులు, ప్రముఖులకు ప్రశంసాపత్రాలను కలెక్టర్, ఎస్పీ, అటవీ అధికారి అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్, కాలుష్య నియంత్రణ మండలి స్టా ళ్లను కలెక్టర్, ఎస్పీ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. అటవీ శాఖ రూపొందించిన పర్యావరణ పరిరక్షణ పోస్టర్తో పాటు "తెలుగు ప్రభ" బుక్లెట్ను కూడా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జెడ్పీ సీఈఓ రవి, డీఆర్డీఓ రవీందర్, డీపీఆర్ఓ ఈ.విష్ణువర్ధన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, డీవైఎస్ఓ శ్రీనివాస్, పశుసంవర్ధక శాఖ అధికారి రామారావు, ఎఫ్డీఓ అరవింద్, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, గ్రామస్తులు, అటవీ, పోలీసు శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెనుబల్లి, వేంసూర్ మండలాల్లో వరుస దొంగతనాలు

- **రూ.18 లక్షల విలువైన బంగారు ఆభరణాల చోరీ**
- **భయాందోళనల్లో గ్రామస్తులు.. పోలీసు గస్తీ పెంచాలని డిమాండ్**

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని పెనుబల్లి, వేంసూర్ మండలాల్లో వరుసగా చోటుచేసుకున్న దొంగతనాలు ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. వేంసూర్ మండలం కేజీ మల్లెల గ్రామంలో రైతు రవికుమార్ ఇంట్లో గురువారం అర్ధరాత్రి జరిగిన భారీ చోరీ స్థానికంగా కలకలం రేపింది. సమాచారం ప్రకారం.. వేసవి కాలం కావడంతో రవికుమార్ కుటుంబ సభ్యులు ఇంటి ముందు ఆవరణలో నిద్రిస్తుండగా, గుర్తుతెలియని దుండగులు ఇంటి తలుపులు తెరిచి లోపలికి ప్రవేశించారు. అనంతరం బెడ్రూమ్లో పరుపు కింద ఉంచిన తాళం చెయ్యి తీసుకుని బీరువాను తెరిచి అందులో ఉన్న సుమారు 100 గ్రాముల బంగారు ఆభరణాలను అపహరించారు. మరో గదిలో ఉన్న రోజువారీ వినియోగ బంగారు నగలను కూడా ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు నిద్రలేచి చూడగా బీరువాలోని నగలు కనిపించకపోవడంతో చోరీ జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇదిలా ఉండగా, అదేరోజు పెనుబల్లి, వేంసూర్ మండలాల్లో మరికొన్ని చోరీ ఘటనలు చోటుచేసుకోవడం ప్రజల్లో భయాందోళనలకు దారితీసింది. ఇంట్లోనే ఉన్న సమయంలో తమకు తెలియకుండా దొంగలు చోరీ చేయడం పట్ల బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. కొందరు తమకు మత్తు పదార్థం ఇచ్చి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనల్లో సుమారు రూ.18 లక్షల విలువైన బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు సమాచారం. వరుస దొంగతనాల వెనుక అంతర్ రాష్ట్ర దొంగల ముఠా హస్తం ఉండవచ్చని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో పోలీసు నిఘా పెంచి ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తూ, నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలతో విచారణ చేపట్టినట్లు సమాచారం. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, రాత్రి పహారా చర్యలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. రాత్రివేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ప్రకృతిని కాపాడాలి

## జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత అని జిల్లా అదనపు కలెక్ట ర్(స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు రావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, ఏపీఓ, పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్ తదితర అధికారులతో కలిసి "స్వచ్ఛ గ్రామం–సురక్షిత జలవాయు" కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని సూచించారు.




ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పర్యావరణహిత వస్తువులను ఉపయోగించడం ద్వారా ప్రకృతిని కాపాడుకోవచ్చని తెలిపారు. వర్షపు నీటిని సద్వినియోగం చేసుకుంటూ ప్రతి నీటి బొట్టు భూమిలో ఇంకేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ కవర్లు, సంచులు, బాటిళ్ల వినియోగం పర్యావరణానికి తీవ్ర ముప్పుగా మారుతోందని, వాటి వినియోగాన్ని పూర్తిగా నివారించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తూ తడి, పొడి, శానిటరీ, ప్రత్యేక వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. కాలువల శుభ్రత, నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. రైతులు శాస్త్రీయ పద్ధతుల్లో సేంద్రియ వ్యవసాయం చేపట్టాలని, పంట మార్పిడి విధానాన్ని అనుసరించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనల పాటింపు ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాల విక్రయాలపై కఠిన చర్యలు

- **ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు**

**ఉద్యమ కెరటం, వాంకిడి:** నకిలీ విత్తనాల విక్రయాలపై కఠిన చర్యలు తప్పవని వాంకిడి ఎస్సై మహేందర్, వ్యవసాయ అధికారి గోపీనాథ్ లు హెచ్చరించారు. శుక్రవారం తహశీల్దార్ కవితతో కలిసి మండల కేంద్రంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులు, రసాయనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా అధికారులు దుకాణాల్లో నిల్వ ఉంచిన విత్తనాలు, ఎరువుల స్టాక్ను పరిశీలించి సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా విడిగా ఉన్న విత్తనాలను విక్రయించవద్దని దుకాణదారులను ఆదేశించారు. రైతులకు విక్రయించే ప్రతి విత్తనం, ఎరువు, పురుగుమందుకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని సూచించారు. కొనుగోలు చేసిన వస్తువులకు సంబంధించిన బిల్లులను రైతులు భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువుల విక్రయాలపై ఎవరైనా సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పదంగా కనిపించే విత్తనాలు, ఎరువుల విక్రయాలపై వ్యవసాయ శాఖ, పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వ్యవసాయ



సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తామని అన్నారు. రైతుల ప్రయోజనాలకు భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య

- **చెట్టుకు ఉరివేసుకుని బలవన్మరణం**

**ఉద్యమ కెరటం, మందమర్రి:** మండలంలోని సండ్రోన్పల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు మద్యానికి బానిసై కుటుంబ కలహాల కారణంగా మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. స్థానిక ఎస్సై జి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాజ్కుమార్ కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అయితే కొంతకాలంగా మద్యానికి బానిసై



తరచూ కుటుంబ సభ్యులతో గొడవపడుతూ మనోవేదనకు గురవుతున్నాడు. గురువారం సాయంత్రం ఇంట్లో భోజనం చేసిన అనంతరం రాజ్కుమార్ బయటకు వెళ్లి గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతసేపటి తర్వాత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి లక్ష్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

# ముత్తూట్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ పట్టణంలో ముత్తూట్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ సామాన్య ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. నాణ్యమైన వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయడంలో ముత్తూట్ ఫైనాన్స్ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందేందుకు ఇలాంటి శిబిరాలు మంచి వేదికగా నిలుస్తాయని తెలిపారు. పట్టణ ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో వైద్య నిపుణులు ప్రజలకు రక్తపోటు, మధుమేహం తదితర వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేసి, రోగుల ఆరోగ్య పరిస్థితిని బట్టి తగిన వైద్య సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముత్తూట్ ఫైనాన్స్ ప్రతినిధులు లక్ష్మణ్, విజయ్, రఘు, సంస్థ సిబ్బంది, స్థానిక వార్డు ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేటితో జొన్నల కొనుగోలు కేంద్రం మూసివేత

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఈనెల 6వ తేదీ నుంచి శాశ్వతంగా నిలిపివేయనున్నట్లు కేంద్ర ఇంచార్జ్ గోలి స్వామి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని రైతులు ఈ విషయాన్ని గమనించి నిర్ణీత గడువులోపు తమ వద్ద ఉన్న జొన్నలను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి విక్రయాలు పూర్తి చేసుకోవాలని కోరారు. గడువు ముగిసిన అనంతరం ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోళ్లు చేపట్టబోమని స్పష్టం చేశారు. రైతులు చివరి రోజు వరకు వేచి ఉండకుండా వెంటనే జొన్నలను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి విక్రయించుకోవాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియను సకాలంలో పూర్తి చేసేందుకు రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన హర్షిని

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** మంచిర్యాల పట్టణంలోని రెవల్యూషన్ పాఠశాలకు చెందిన విద్యార్థిని కొండగొర్ల హర్షిని బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి ప్రతిభ చాటింది. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆమెను అభినందించారు. కోటపల్లి మండలం ఆల్గాం గ్రామానికి చెందిన హర్షిని బెస్ట్ అవైలబుల్ స్కీం ద్వారా రెవల్యూషన్ పాఠశాల హాస్ట ల్లో ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యాభ్యాసం చేసింది. పదో తరగతి పరీక్షల్లో 588 మార్కులు సాధించి ఉత్తమ ఫలితాలు నమోదు చేసింది. ఆమె ప్రతిభకు




గుర్తింపుగా బాసర ట్రిపుల్ ఐటీలో ప్రవేశం లభించడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ రాపోలు విష్ణువర్ధన్ రావు మాట్లాడుతూ హర్షిని సాధించిన విజయం ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని ఆమె నిరూపించిందని కొనియాడారు. పాఠశాల ఉపాధ్యాయులు హర్షినికి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆమె విజయం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు.

# 'హై డెన్సిటీ' పద్ధతిలో మొక్కల పెంపకానికి శ్రీకారం

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్ జిల్లా యంత్రాంగం, అటవీ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో "ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, అటవీ విస్తరణ లక్ష్యంగా 'హై డెన్సిటీ మిక్స్డ్ ప్లాంటేషన్' విధానంలో భారీ ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. యాపల్గూడ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావ్ పాటిల్లతో కలిసి ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి




మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ జాతీయ పతాక ముగ్గు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ భావితరాలకు అందించగలిగే అత్యుత్తమ కానుక పచ్చని పర్యావరణమేనని అన్నారు. అడవుల సంరక్షణ, మొక్కల పెంపకం ద్వారా కాలుష్యాన్ని అరికట్టి పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని తెలిపారు. సకాలంలో వర్షాలు కురవాలన్నా, ప్రకృతి సమతుల్యత నిలవాలన్నా ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 'హై డెన్సిటీ మిక్స్డ్ ప్లాంటేషన్' విధానంపై ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. మొక్కలు నాటే కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్న వారికి అతిథులు ప్రశంసాపత్రాలు అందజేశారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ రవీందర్ రాథోడ్, జెడ్పీ సీఈఓ బి.రవి, డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, ఉట్నూర్ ఫారెస్ట్ డెవలప్మెంట్ ఆఫీసర్ అరవింద్, యాపల్గూడ సర్పంచ్ నిరోషా, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు నాగన్న, కిష్టయ్య, నర్సింగ్, కొడప లింగు, రామారావు, కాంగ్రెస్ నాయకులు మోసిన్, అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

